నాటిక

# కాలక్షేపం

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారు

[మహాలక్ష్మమ్మగారి యింటి లోతట్టు పడమటింటి వసారాలో మహాలక్ష్మమ్మ, సోదెమ్మ, సుబ్బమ్మ, వత్తి ప్రత్తి చేసుకుంటూ కూర్చుండి ఉంటారు.]

సుబ్బమ్మ సోదెమ్మక్కా! రామ వనవాసం విని చాలా రోజులైంది. ఏదీ రెండుముక్కలు చెవిని వెయ్యవూ

మహాలక్ష్మమ్మ అవును వదినే! నీ పాటవిని చాలా రోజులైంది. యీ మధ్య యాత్రలతో మునిగి తేలుతూ కంటికే కఱువై పోతివి. ఏదీ నాలుగు చరణాలుపాడు.

సోదెమ్మ ఆ! నా పాట లేం పాటలు లేవమ్మా. యీ పూర్వకాలపు పాటలువింటే యీ కాలపువాళ్ళు నవ్వుతారు గూడా.

మ: పోనీలే, నవ్వేది యీ కాలపువాళ్ళుగా. మేము యీ కాలపు వాళ్లంకాముగా, పాడుదూ!

(పాట)

సో: దేవాసుర సంగ్రామమందూ
మీ తండ్రి రణము చేయుచునుండగా
అసుర మూకలు చుట్టుముట్టి
బహువిధ అస్త్రచయములు గుప్పగా
తేరు నడిపే సారథీ తలతెగి
ధరణిపైనా ద్రెళ్లెనూ
తేరులోనున్న మీ జనకుడూ
తెప్పునా మూర్ఛిల్లెనూ
ఆ రథంబులో నున్న నేనూ అంతట
అందుకొని పగ్గంబులూ
సీల విరిగిన చోటునూ నా
వ్రేలు నడ్డుగ బెట్టుచూ
వడి వడిగ గుఱ్ఱముల నడిపీ
రథమువ రణమున కెడగాను చేసి
మూర్ఛితుండైన మీ తండ్రినీ
కాచి రక్షించితిని రామా
అందులకు మీ తండ్రిమెచ్చీ
అడుగుమనె రెండువరములూ
అవసరంబైన వేళనూ
అడుగుదునని నే నంటినీ
ఆ వరంబులను నేడూ
అడిగితిని మీ తండ్రినీ
ఒక వరంబునకు నీవు అడవిలో
పదునాలుగేడ్లుండ వలెనూ
రెండవ వరముగ నా సుతుడు
భరతునకు పట్టంబు గట్టవలెను

సు: (దుఃఖంతో రాపడిన కంఠంతో) అయ్యో! దీని కటికతనం కాలిపోను. వరాల తండ్రి ఆ రామచంద్ర మూర్తిని అడవికి పొమ్మనడానికి నోరెట్లావచ్చిందో.

మ కారణార్థం అట్లా వున్నప్పుడు నోరాడకేమి చేస్తుంది? కానీ వదినే!

(పాట)

సో అడవినున్న వేళనూ మునివలె
జడలు ధరియించి నీవూ
నార చీరలు గట్టి రేబవలు
కాయగసురులు మెసవుచూ
బ్రహ్మచర్య వ్రతమునూ ఓరామ
గడపవలె పద్నాలుగేండ్లూ
ఈ పగిది నీవు చేయకున్నా ఓ రామ
నీ తండ్రి చెడును సద్గతులకూ.

శారద (ప్రవేశించి) సోదెమ్మత్తా! ఏదో పాటలు పాడుతున్నావే.

సో : ఆ! ఏమిపాటే! మీ అమ్మావాళ్ళు పాడమని వేధిస్తే ఏదో నోరూరుకోక "రామ వనవాసంలో" రెండు ముక్క లంటున్నా.

శా : ఆపివేశావేం ? పాడూమరీ.

సో . ఏమి పాడనే నాకు మీవలె రాగాలు వచ్చునా ? తాళాలు వచ్చునా ? చదువులు సంగీతాలు నేరుస్తున్న మీ దగ్గర పాడితే నవ్వుతారు కూడాను.

శా నవ్వనత్తా ! నీ పాటంటే నాకు చాలా యిష్టం.

సో : మీరు సినీమాలూ నాటకాలూ చూచీ, గ్రామ్‌ఫోనులు, రేడియోలు, వినీ రకరకాల పాటలు నేర్చుకొని పాడుతారు మాకేమున్నది ? పూర్వ కాలపు వాళ్లం. మావన్నీ పాత పాటలు. ఊరికే ఉండలేక కృష్ణా రామా అనుకుంటాము

సు : (బుగ్గలు నొక్కుకుంటూ) అయ్యో వ్రాత. ఇప్పటి వారిపాటలూ సరే నా బ్రతుకుసరే. మా చిన్న పిల్ల ఆ నాలుగేళ్లది ఉన్నదే "తీయని వెన్నెల రేయీ" అని ఏమిటో వాగుతూ ఉంటుంది. వెన్నెల తెల్లగా ఉంటుంది చల్లగా ఉంటుందంటే అర్థమున్నది కాని, తీయగా ఉండుటమేమిటో తెలియదు.

సో : అదిసరే మా కుర్రాడు చూచావు ! 'కత్తులు దూసుకు పోనీ, నెత్తురు ఏరులు పారనీ, ఎండలో తిరిగావురా కుర్రోడ చెమటలో మునిగావురా కూలోడ' - అంటూ ప్రొద్దుగూకులు పాడుతూ ఉంటాడు. విన్నావో లేదో. అవేమి పాటలో పూర్వం యీ యీడు పిల్లలకు చక్కగా 'చేతిలో వెన్నముద్ద, చిన్న చెంబుతో నీళ్లు, శ్రీ రుక్మిణీశ కేశవ నారద సంగీతలోల' అని యెన్నో చక్కని పద్యాలు 'నంద నందనా, గోపాల బాల' అని చక్కని కీర్తనలు చెప్పేవాళ్ళు. ఇప్పుడివేమి పాటలో ! పుణ్యంలేదు పురుషార్థం లేదు వినడానికే అసహ్యం వేస్తాయి.

శా : ఏ కమ్యూనిష్టులో వీధిలో ఊరేగుతూ పాడుతూ ఉంటె విన్నాడు కాబోలు.

సు శారదా కమ్యూనిష్టులంటె ఎవరే ?

శా అదొక పార్టి మన దేశంలో వెలిసిందిలే. దాని వాళ్లు ఆ పాటలు పాడుతూ ఉంటారు.

సో అంతేలే దేని వాళ్ళు దాని పాటలు పాడుతూ ఉంటారు. మా యింట్లో చూడలే ఎప్పుడూ కాంగ్రెసూ గాంధీ జెండాల్లు, జేజేలు ! యీ కాలపు పాటలేయింత.

శా అవునత్తయ్యా కాలానికి తగినట్టుగా పాటలూ పద్యాలు పాడరూ, కథలూ కావ్యాలు వ్రాయరూ, పురాణాలు శాస్త్రాలు చెప్పరూ ? ఎప్పుడో త్రేతాయుగం నాటి పాటలే యిప్పుడు పాడదామనుకుంటే ఎట్లా ? ఈ కాలానికి తగినట్టుగా యిప్పటి పాటలుండొద్దూ ?

సు కాలానికో పాట ఉంటుందిటే శారదా !

శా ఆః ఉంటుంది ఉండకేం ? ఇప్పుడేం పాట పాడా లనో పాడనా.

సో పాడమ్మా ! పాడు మేమూ వింటాం.

(పాట)

శా రేషనింగు రోజులోయి గోవిందారామ
నిముషమైన తీరదోయ్ గోవిందా
చేతులు జల్లెళ్లు గోవిందారామ
రోళ్ళు రోకళ్ళోయి గోవిందా
ఎప్పుడు చేతుల్లో గోవిందారామ
ఆడుతు ఉండాలే గోవిందా
తలచమురు లేదోయ్ గోవిందారామ
దీపపు చమురులేదు గోవిందా
పసిబిడ్డ పాలకూ గోవిందారామ
భాగ్యవంతుల కాఫీకి గోవిందా
పంచదార లేక గోవిందారామ
పాట్లుపడదామాయె గోవిందా
కట్టుబట్టకు గూడా గోవిందారామ
కష్టాలు పడనాయె గోవిందా
రేషన్ బియ్యం దెచ్చి గోవిందారామ
రేషన్ కట్టెలు పెట్టి గోవిందా
అన్నమొండు కుంటె గోవిందారామ
ఆకలే తీరదోయ్ గోవిందా

పాడిపంటల దేశమిట్లు గోవిందారామ
పాడయి పోయిందోయ్ గోవిందా
దేశపు జనులంతాను గోవిందారామ
డబ్బాశలేకుండా గోవిందా
తిండిగింజలు పండిస్తే గాని గోవిందారామ
తీరదండీ కఱువు గోవిందా.

సో, సు, మ } ముగ్గురు పక పకా నవ్వుతారు.

సో మంచిపాటే కట్టావే శారదా.

మ నిజంగా యిప్పటి కష్టాలట్లాగే ఉన్నాయి

సు అయ్యో! ఎంత మంచికాలం పోయిందమ్మా? పుట్లకు పుట్లు ధాన్యాలు అపరాలు పండించుకొని గాదెలకు గూనెలకు బోసుకొని హాయిగా తినే వాళ్ళం. ఇదేమి కాలమో నోటూరా తినడానికి, చెయ్యారా పెట్టడానికి లేకుండా బోయిందిగదా! ఏ రోజునా హవ్య కవ్యం అతిధీ అభ్యాగతీ, నలుగురు పంక్తిని లేనిది ఔపాసన పట్టేవారుకారు, మా మామగారు. రాత్రిజాము ప్రొద్దు బోయిన మాదాకబళమమ్మా అన్నమాట వినపడ నిచ్చే వారుకారు. శ్రీరామజయంతీ కృష్ణజయంతీ దేవీ నవ రాత్రులు ఎప్పుడు ఏదో సందర్భము, వడుగులు పెండిండ్లు సమారాధనలు సంతర్పణలు జరగడము, పిన్నా పెద్దారావ డము నిత్యకల్యాణం పచ్చతోరణంగా ఉండేది ఏ యిల్లు చూచినా. వడ్డనకూ వంటకూ మా అత్తగారు ఎప్పుడు నడుం బిగ్గట్టే ఉండేది. ఆమె చేతికింద నలుగురు కోడళ్లము హూనం హూనం అయ్యేవాళ్లం. ఏడాది తిరిగేటప్పటికి ఎన్నిపుట్లు నలిగేవో! ఇప్పుడయితే ఏం జేసే వాళ్ళం?

సో: ఇప్పుడా మావాడు చెప్పితే వినలే. తద్దినానికి ముగ్గురికి శ్రాద్ధానికి పదిమందికి పెండ్లికి ముప్పైమందికీ బియ్యపుచీట్లు యిస్తారట. అయ్యో రాత కర్మంజాలక యింకో మనిషివస్తే ఏమవుతుందంట? ఆ పాడీ పంట యేమయిందో అన్నం నంచుకొని నెయ్యి వాసన చూచే రోజులు వచ్చాయి.

శా ఏమయింది? పాగాకైంది, వేరుశెనగయింది. డబ్బాశపడి తిండి గింజలు పండించకుండా వాణిజ్యపు పంటలు పండించుకొని నోట్లు కట్టలుకట్టుకుంటూ ఉంటే బియ్యాలు పప్పులు ఎక్కడినుంచి వస్తాయి?

మ: అవునమ్మా తిండిగింజలు పండిస్తేగాదు ఆహార పదార్థాలు సమృద్ధిగా దొరికేది. అందరికి డబ్బురంథే అయిపోయె. ఆ డబ్బైనా వెండా బంగారమా!

శా యిక ఆ ఆటలు సాగవులే ఆహారపంటలు ప్రతిరైతు పండించి తీరవలసిందే

సు: ఏమీ!

శా పై దేశాలనుంచి తెప్పించే బియ్యం గోధుమలూ వగైరాలు యిక మన గవర్నమెంటువారు తెప్పించరు.

సు. అట్లాగా

సో అన్నట్టు మరచిపోయినా శాస్త్రిలుగారు ఊరినుంచి వచ్చారు. మఠంలో పురాణం వినకుండా యీ పురాణాలు పెట్టుకొని కూర్చున్నారేం?

మ అప్పుడే పెండ్లిచేసుకొని వచ్చారటమ్మా వదినే.

సో: ఆ! ఆ! వచ్చారు చెట్టంత పిల్లనుచేసుకొని వచ్చారు.

మ ఈడేరిన పిల్లే.

సో. కాక చిన్న పిల్లలెక్కడున్నారు? శాస్త్రిలుగారు కానీ చయనులుగారు కానీ.

శా పెద్దపిల్లని ఆశ్చర్యపడుతున్నారు. బ్రాహ్మణ పిల్లవునో గాదో.

మ ఛా నోరుమూసుకో. మీ నాన్నగారువింటే కోప్పడు తారు.

శా. ఎందుకమ్మా నన్ను కోప్పడడం? అంత ముసలివాడు ఇంత చిన్న పిల్లను చేసుకున్నందుకు ఆ శాస్త్రిలుగారిని కోప్పడరాదు?

సు ఆయన కష్టం నీకేమి తెలుసు కాచి పోసే దిక్కులేక చేసుకున్నాడు. ఏమంటావు?

శా: ఆడవాళ్ళకు గూడా కష్టాలుండవూ? బాల వితంతువుల పెండ్లంటే, ఆడవాళ్ళకు ఆస్తిలో భాగాలంటే వీరందుకు అడ్డపడడం?

## కాలక్షేపం

మ అబ్బా ఏమిటే శారదా యీ లెక్చరు? మీ నాన్నగారు కచ్చేరినుంచి వచ్చే వేళ కూడా అయింది ఊరుకోవు నీవేమో నదురు బెదురు లేకుండా యిట్లా వాగుతావు ఆయనేమో మేనమామ పోలికని వాడిని ఆడిపోసుకుంటారు

శా నిజం సంగతి చెప్పుతున్నానమ్మా ఇందులో తప్పేమున్నది? సంగతి తెలుసుకోక పోతే ఎట్లా వుద్ధరింపబడుతాం?

మ ఏదో మా కాలం యిట్లా వెళ్ళి పోయింది ఇక మా బ్రతుకులిట్లా తెల్లవారవలసిందే ఎవరు ఉద్ధరించేదిలేదు.

సో అదేమిటి వదినే అట్లా అనుకుంటావు చదువుకుంటున్నదిగా, శారదే మనలనందరిని ఉద్ధరిస్తుంది దీని యీడులో మనమెట్లా వుండేవాళ్ళం? గబ్బిలాయిల్లాగా పరికిణీ చొక్కాయయినా తిన్నగా కట్టుకోడం చేతయ్యేదీ? శారద చూడు ఈ యీడు కప్పుడే ఎన్ని విషయాలు తెలుసుకున్నదో

సు అవునమ్మా తెలుసుకోదూ! చదువుకున్న వాళ్లకు చదువుకోని వాళ్ళకు యిదే తేడా మరీ! ఇంకా రెండేళ్లపాటు చదువుకున్నదా ఆడవాళ్ళను ఉద్ధరించనే ఉద్ధరిస్తుంది

మ ఆఁ యింకా రెండేళ్ళు చదువుకుంటుందిగా, ఈ యేడే బడికి పంపనంటే పంపనన్నారు, వాళ్ళ నాన్న బడికి పోకమానని యేడుస్తూ కూర్చున్నది ఆ బడికి పంపవలసిందేనని అన్నగారు వత్తాసిచ్చాడు అంతటితో యికనేమీ అనలేక వూరుకున్నారు

సు అన్నట్టు మీ అబ్బాయి పెళ్లెప్పుడమ్మా?

మ పెండ్లిగానే ఉన్నది ఆయనగారికేమో వేల మీద దృష్టి, అతడికేమో చదువుకున్న పిల్లమీద

శా నీకేమో పనిచేసే కోడలిమీదా

మ ఇవమ్మా దీనిమాటలు

సో మీ మేనగోడలున్నదిగా, ఆ అమ్మాయి బియ్యేగూడా ప్యాసైందిగా

మ అయ్యో! మేనగోడలే, బి ఏ ప్యాసైన పిల్ల నే! మీ అన్న గారు ఒప్పుకుంటారు? మా తమ్ముడిదేమీ లేదు అడిగితే సరేనంటాడు మా మేనగోడళ్లైనా ఒకరివంటి వాళ్ళుగాదు అంత చదువు చదువుకున్నా ఎంతో అణకువగా ఉంటారు ఇంట్లో సమస్త పనులు చేస్తారు. చదువువచ్చినట్టే కనపడరు అయితేనేం ఈయనగారు ఒప్పుకుంటారు? ఎందుకొచ్చిన భ్రమ.

సు సరేలే వ్రాసిపెట్టివుంటే ఎవ్వరూ తప్పించలేరు

సో సుబ్బమ్మక్కా లేస్తామా ఏమిటి? అన్ని పురాణాల కాలక్షేపం యిక్కడేఅయింది అస్తమానంకా వచ్చింది పోదాంపద ఇంట్లో పనులు పిలుస్తున్నాయి

★

# లక్ష్మమ్మ టెక్నికల్ ఇన్స్టిట్యూట్

## ఆంధ్రమహిళాసభ

స్త్రీలకు ప్రత్యేకంగా, టైప్, షార్ట్‌హాండులో శిక్షణ ఈయబడును ఉదయము 10 గంటలనుండి, సాయంకాలము 5 గంటలవరకు శిక్షణజరుగును ఇతర సమయాల్లో శిక్షణ కోరువారికిగూడ ఏర్పాట్లుకలవు

మాసరుసుము ఒక్కొక్క సబ్జెక్టుకు రూ 3-0-0

వివరములకు వ్రాసి తెలుసుకోనుడు

ఈ సదవకాశమును పునస్కరించుకోనుడు

అ చన్నఘంటమ్మ

కరెస్పాండెంటు